సాక్షి జగిత్యాల

బుధవారం । 25 । జనవరి । 2023



మార్కండేయ జయంతి

మెట్‌పల్లి: పట్టణంలో మంగళవారం మార్కండేయ జయంతి నిర్వహించారు.



పొలం గట్లపై శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం గ్రామాల్లో పర్యటించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0/17.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా వైద్య పరీక్షలు



సూచనలు ఇస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

మెట్‌పల్లి: కంటి వెలుగు కేంద్రాల్లో వైద్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఆర్డీవో వినోద్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. కేసీఆర్ తండా, కోనరావుపేట గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. పరీక్షలు, కంటి అద్దాల సమాచారం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో భీమేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళల స్వయం ఉపాధి యూనిట్ల పరిశీలన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గారిమ శర్మ

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్‌లో నాబార్డు ద్వారా ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న స్వశక్తి సంఘ సభ్యులు ప్రస్తుతం పొందుతున్న ఉపాధి, ఆదాయాభివృద్ధి, మార్కెటింగ్ సదుపాయాలు, పొదుపు, రుణాల నిర్వహణ, నాబార్డు చేస్తున్న సాయం, బ్యాంకు లింకేజీ తదితర అంశాలపై ముంబయికి చెందిన విలింగ్టన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గారి మశర్మ మంగళవారం అధ్యయనం చేశారు. మహిళా సంఘా నిర్వహిస్తున్న కట్టెగానుగ నూనె తయారీ, మినీరైస్ మిల్లు, మ్యారేజీ క్యాపులు, కుండల తయారీ యూనిట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్ రెడ్డి, నాబార్డు ఏజీఎం మనోహర్‌రెడ్డి, జన వికాస్ సంస్థ సీఈవో సంపత్‌కుమార్, సర్పంచ్ చెరకు జాన్, ఏపీఎం గంగాధర్, సీసీ గంగారాం, వీవోఏలు భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూముల చదునుపై గ్రామస్తుల మధ్య వివాదం

కథలాపూర్(వేములవాడ): ఇప్పపెల్లి, పోతారం గ్రామాల మధ్య అటవీశాఖ భూములు చదును చేయడంపై మంగళవారం రెండు గ్రామాల ప్రజల మధ్య వివాదం చోటు చేసుకుంది. అటవీ భూముల్లో చెట్లను తొలగించి నేల చదును చేయడం నిబంధనలకు విరుద్ధమని పోతారం గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇటీవల ఇప్పపెల్లి గ్రామానికి చెందిన కొందరు అటవీభూములను చదును చేయడంతో వివాదానికి కారణమని రెండు గ్రామాల ప్రజలు అంటున్నారు. అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమంగా భూములను చదును చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పోతారం గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం



కలెక్టర్ రవి

జగిత్యాల: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ రవి సూచించారు. మంగళవారం ఆయన అధికారులతో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మన ఊరు.. మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన ప్రగతి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. బస్తీ దవాఖానా పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లత, మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

కంది పంట కొనుగోళ్లకు ఐదు సేకరణ కేంద్రాలు



అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: జిల్లాలో కంది పంట కొనుగోలు కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ లత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 2022 వానాకాలం పంట సేకరణకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. జగిత్యాల వ్యవసాయ మార్కెట్, ధర్మపురి, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్‌లో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి కంది పంటను ఆయా కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి రెండు పేజీలు జిరాక్స్ వెంట తీసుకు రావాలని ఆమె సూచించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

ఆటాడేస్తున్నారు..!

పాపం శ్రీనివాస్..



- ఆకుల శ్రీనివాస్, సోదరుడు తిరుపతి కలిసి 6 సంవత్సరాల క్రితం వేములవాడ మండలం వెంకటాంపల్లిలోని 26, 36, 39, 41, 42, 43, 44 సర్వేనంబర్లలో గల సాగు భూమిని రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేశారు. ధరణి రాక ముందు జరగగా మ్యుటేషన్ చేయడంలో ఆలస్యం అయింది. అంతలోనే ధరణి వచ్చి చేరింది. దీంతో ధరణిలో మ్యుటేషన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌ను బంతాట ఆడుతున్నారు. ఒక్కోసారి ఒక్కో కొర్రీ పెడుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ముందు కాలువ కింద భూమి పోకున్నా.. పోయిందని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. తరువాత రుణమాఫీ అయినప్పటికీ బ్యాంక్ లోన్ ఉందని నెలల తరబడి తిప్పుకున్నారు. సాక్షి కథనం క్రమంలో రెండు, మూడు సర్వే నంబర్లను పరిష్కరించగా మళ్లీ అదే పరిస్థితి. 36, 39, 41 ఇతర సర్వేనంబర్లలోని బై నంబర్లలో కొన్నింటికి డిజిటల్ సైన్ చేయగా మరికొన్ని నాలా అంటూ, ప్రొహిబిటేడ్ అంటూ పేర్కొనడం విడ్డూరం. తీరా కలెక్టర్ చేతిలో ఉందని చేతులెత్తేశారు. ఫలితంగా ఆరేళ్లుగా రైతుబంధు అందకపోగా ఇతర ప్రయోజనాలు పొందడం లేదు.

ఎవరి తప్పు..



- ఈ రైతు పేరు కస్తూరి కీర్తికుమార్. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామం. గ్రామంలోని 924/ఆ/2/1లో వారసత్వంగా 12 గుంటలు నమోదు కావాల్సి ఉండగా కేవలం 2 గుంటలు మాత్రమే నమోదైంది. ఇదెక్కడి అన్యాయమని రెవెన్యూ అధికారులను కలిస్తే ఉపశమన మాటలే తప్ప పరిష్కరించలేదు. మీసేవలో చేసిన దరఖాస్తులో తప్పుల వల్లే తప్పుగా నమోదైందని అధికారులు చెబుతుండటం విశేషం. ఇవి కేవలం వీరిద్దరి సమస్యనుకుంటే పొరపాటే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేల మంది రైతుల గోస.

- తప్పు చేసేదివారే.. నిర్లక్ష్యం వారిదే..
- భూ రికార్డుల నిర్వహణలో ఇష్టారాజ్యం
- వేలమంది రైతుబంధుకు దూరం
- అప్పులిచ్చేందుకు బ్యాంకుల నిరాకరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'ఎవరో జ్వాలను రగిలించారు.. వేరెవరో దానికి బలి అయ్యారు' అన్న పదాలకు ధరణి పోర్టల్ సమస్యలు సరిగ్గా సరిపోతాయి. భూముల విషయంలో పారదర్శకత తీసుకువస్తామని చెప్పి.. అమలులోకి తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో పాత సమస్యలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తూ రైతులను ముప్పతిప్పలు పెడుతోంది. చిన్న పొరపాట్లు, అక్షరదోషాలు, తప్పుల సవరణ చేసేందుకు సైతం అధికారులు బాధితులను నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో సామాన్యులు.. అందులోనూ రైతులు నానా ఇబ్బందుల పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వపరంగా అందాల్సిన రైతుబంధు వీరికి అందని ద్రాక్షగా మారింది. సవరణలు చేయాలని కాళ్లరిగేలా



తిరిగినా.. కనికరించే నాథుడు లేకుండా పోవడం అత్యంత బాధాకరం.

- ప్రభుత్వం భూ సమస్యల్లేకుండా దిద్దుబాటు చర్యలు చేపడుతుండగా అధికార యంత్రాంగ నిర్లక్ష్యం గుదిబండలా మారింది. కాలువ కింద భూమి పోకున్నా పోయిందని, నాలా భూమని, బ్యాంకు లోన్ ఉందంటూ తిర'కాసులు' పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం వీరికే చెల్లు. నెలలు కాదు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారంటే విధుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సర్వే నంబర్ సమస్యలో ఉంటే సరే అందులోని బై నంబర్లు సరిగా ఉండటం, మరిన్ని సమస్యల్లో ఉంచడం దేనికి సంకేతం. పలువురు కలెక్టర్లు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కొరడా ఝుళిపిస్తుండగా పలువురు కలెక్టర్లు పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరం. ప్రతీ కుటుంబంపై కలెక్టర్‌కు అవగాహన ఉండాలని, సమస్యల్లేకుండా పాలన ఉండాలనే జిల్లాల విభజన చేసినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించగా క్షేత్రస్థాయిలో పరిస్థితి విరుద్ధం.

ధరణి పేరిట కాలయాపన.. ప్రజావాణిలో అత్యధికం ఇవే

రెవెన్యూ అధికారులు మామూలుగా పరిష్కరించే సమస్యలను కూడా ధరణితో ముడిపెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో ఈ తరహా కేసులు ఉండటం ఆశ్చర్యపరుస్తోంది. జగిత్యాల జిల్లాలో 8,174 దరఖాస్తులు రాగా ఇందులో తిరస్కరించినవి 2,685. అంగీకరించినవి 5,489. అంటే 426 రోజుల్లో రోజుకు 12 అర్జీలు వచ్చినట్లు అధికారికంగా ఇచ్చిన సమాచారంతో స్పష్టమవుతోంది. ఈ లెక్కన రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మరో 15 వేల వరకు ధరణి దరఖాస్తులుంటాయని స్పష్టమవుతోంది. ఇక ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల్లో అత్యధికం ఇవే ఉండటం అధికారుల పనితీరుకు నిదర్శనం. ప్రతీ సోమవారం కలెక్టరేట్లలో ప్రజావాణి జరుగుతుండగా సుమారు 200 వరకు అర్జీలొస్తున్నాయి. ఇందులో 70–90వరకు ఇవే అర్జీలున్నాయంటే పరిస్థితి తీవ్రతను చాటుతోంది.

మార్పులకు అవకాశంలోనూ నిర్లక్ష్యం..!

రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో పలు ఆప్షన్లకు అవకాశమిచ్చింది. అయినా.. అధికారుల వల్లమాలిన నిర్లక్ష్యం రైతులకు శాపమవుతోంది. పట్టాదారు పాసు పుస్తకంలో అక్షర దోషాలు ఉన్నా పొరబాటున వేరే పేరు పడినా సరి చేసుకోవచ్చు. మహిళకు బదులు పురుషుడు, పురుషుడికి బదులు మహిళ అని అచ్చు తప్పు దొర్లినా, రిజర్వేషన్ కేటగిరీ తప్పుగా నమోదైనా, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైనా సరిచేసుకోవచ్చు.

- అలాగే పట్టా, సీలింగ్, భూదాన్, అసైన్డ్ వంటివి తప్పుగా నమోదైతే మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- భూమి ఏ విధంగా సంక్రమించిందనే వివరాల్లో తప్పులుంటే మార్చుకునే వీలుంది.
- వాస్తవ భూమి కంటే పాస్ పుస్తకంలో తక్కువగా నమోదైతే మార్చుకునే వీలుంది. దీంతో ఎక్కువ.. తక్కువ సమస్యలు తొలగుతాయి.
- భూమి వర్గీకరణ మాగాణి, తరి, మెట్ట వంటి వివరాల మార్పిడి చేసుకోవచ్చు.
- వారసత్వం, అన్న, తమ్ముడు, సొంతం, కుమారుడు వంటివి మార్చుకునే అవకాశముండగా ఏదైనా సర్వే నంబర్ లేదా సబ్ డివిజన్ నంబర్ కనిపించకపోవడం, ఆ మేరకు విస్తీర్ణం తక్కువగా నమోదైతే మార్చుకునే అవకాశముంది. దీనికి సంబంధించిన సర్వే నంబర్లను ఎంచుకోవచ్చు.
- ఏదైనా కారణంతో భూమి 1బీ ఖాతాలో చేరి ఆ తర్వాత పరిష్కారమైతే వాటిని పట్టా నమోదుకు అవకాశం ఇచ్చారు. కానీ సదరు అర్జీల్లోనూ నిర్లక్ష్యం చేస్తున్నారని ఉమ్మడి జిల్లా రైతులు వాపోతున్నారు.

సమస్యలు ఎన్నెన్నో..!

ఎకరాన రూ.20 లక్షలు పలికినా భూముల ధరలు నేడు కోటికి చేరడంతో అత్యంత విలువైందిగా మారింది. దీంతో భూ వివాదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యల్లేకుండా చొరవ తీసుకోవాల్సిన యంత్రాంగం నత్త నడకన వ్యవహరించడం దారుణ పరిణామం. ఒకరి భూమి ఒకరి పేరున నమోదవడంతో వీటిని తిరిగి పొందేందుకు ఆప్షన్లు సైతం లేకుండా పోయాయి. నాలుగైదు దశాబ్దాల కిందట భూములు అమ్ముకున్నవారు సైతం ధరణిలో రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగా వారి పేర్లు రావడంతో భూములు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్లతరబడి సాగుచేసుకుంటుండగా వంశపారంపర్యంగా వచ్చిన భూములు ఇతరుల పేర్లపై ధరణిలో నమోదయ్యాయి. పక్కాగా ఉన్న పట్టా భూములు సైతం నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో రైతులు పంట రుణాలు పొందలేని దుస్థితి ఏర్పడింది. చాలా సర్వే నంబర్లు మిస్ అయ్యాయి. ఏళ్లుగా రైతుబంధుకు దూరమవుతున్నారు.

ఆలయాల్లో పవన్ పూజలు



కొండగట్టులో అభిమానులకు అభివాదం చేస్తున్న జన సేన అధినేత పవన్ కల్యాణ్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న జనసేన అధినేత

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: జన సేన అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనను చూసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది యువత, అభిమానులు తరలివచ్చారు. తొలుత కొండగట్టు అంజన్న ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆ తర్వాత పవన్ కల్యాణ్ శ్రీఆంజనేయస్వామికి శేష వస్త్రాలు, తమలపాకులు, పండ్లు సమర్పించారు. మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్ర స్వామి, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, అఖిల్‌కృష్ణ, రామ్, లక్ష్మణ్.. పవన్ కల్యాణ్‌కు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం జనసేన ప్రచార రథం వారాహి వాహనానికి పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా అంజన్న సన్నిధిలో దర్శనం నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వారాహి పూజ అనంతరం ఆ వాహనంపైకి ఎక్కిన పవన్ కల్యాణ్ అభిమానులకు అభివాదం చేశారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి జన సేన పనిచేస్తుందని అన్నారు. ఆ తర్వాత 'జై తెలంగాణ' అంటూ ప్రచారం ముగించారు. మరోవైపు.. నాచుపల్లిలోని బృందావన్ రిసార్ట్స్ వద్ద కార్యకర్తలతో సమావేశమైన పవన్ కల్యాణ్‌ను చూసేందుకు వందలాది మంది అభిమానులు తరలివెళ్లారు. లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా, వారిని వారించేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. తమ పార్టీ నాయకులను లోనికి ఎందుకు అనుమతించడంలేదని జన సేన పార్టీ నాయకుడు దయాకర్.. రిజర్వ్ సీఐని దుర్భాషలాడారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ధర్మపురి నృసింహుని సన్నిధిలో..

సాయంత్రం 6.30గంటలకు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధికి చేరుకున్న పవన్ కల్యాణ్.. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణాన్ని అష్టదిగ్బంధం చేశారు.

విజ్ఞానం ఏ ఒక్కరి సొంతం కాదు

- మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య



జస్టిస్ చంద్రయ్యను సన్మానిస్తున్న అతిథులు

వెల్గటూర్(ధర్మపురి): విజ్ఞానం ఏఒక్కరి సొంతం కాదని, కష్టపడి చదివితే ప్రతీఒక్క విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకుంటాడని మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఉత్తమ సర్పంచ్ కంది లావణ్య, ఆర్చరీలో జాతీయస్థాయిలో బంగారు పతకం సొంతం చేసుకున్న వెల్గటూర్ ఆర్ఐ రాజేశ్వరి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్, పీడీ రాజమల్లయ్యను ప్రతినిధులు సన్మానించారు. అనంతరం జస్టిస్ చంద్రయ్య మాట్లాడారు. స్వామీ వివేకానంద, అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని చదువు కోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యతోపాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అధ్యయనం, అవగాహన, ఆచరణ అత్యంత ప్రధానమని తెలిపారు. చదువుకు అంగవైకల్యం, ఆర్థిక అసమానతలు ఏవీ అడ్డురావని అన్నారు. చదువు, సామాజిక అంశాలు, మేధావుల జీవిత విశేషాలను విద్యార్థులకు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జస్టిస్ చంద్రయ్యను ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈవో భూమయ్య, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, కొత్తపేట సర్పంచ్ కొమ్ము రాంబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మలత, నాయకులు చల్లూరి రాంచంద్రం, పెద్దూరి భరత్, కంది విష్ణు, పీఆర్‌సీ వైద్య వెంకటేశ్ పాల్గొన్నారు.

అధిష్టానం వద్దకు పంచాయితీ

- చైర్‌పర్సన్ భోగ శ్రావణిపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిందే
- పట్టుబడుతున్న పలువురు కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే సంజయ్‌దే తుది నిర్ణయం
- 27 తర్వాత రాజీనామా చేసే యోచనలో బల్దియా సభ్యులు



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల: మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి కౌన్సిలర్లు నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మంగళవారం వారు మళ్లీ కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సిందేనని మొండికేశారు. ఆ నిర్ణయాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కే వదిలేశారు. దాదాపు 27 మంది ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి రావడంతో ఈవిషయాన్ని ఎమ్మెల్యే.. జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. అవిశ్వాస తీర్మానంపై ఎలా వ్యవహరించాలనే దానిపై చర్చించేందుకు త్వరలోనే సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం.

అధిష్టానిదే దిశానిర్దేశం..

- మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి పలువురు కౌన్సిలర్లు ఏకతాటిపైకి వచ్చిన విషయం బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లింది.
- భవిష్యత్ కార్యాచరణపై అక్కడి నుంచే దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిసింది.
- అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడితే ఎదురయ్యే పరిణామాలు ఏమిటనే దానిపై అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.
- శ్రావణి తీరుపై గతంలోనే ఫిర్యాదులు రావడంతో అధిష్టానం కూడా ఇందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది.
- మరోవైపు.. నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత ఆశీస్సులతో పదవి దక్కించుకున్న శ్రావణి.. తన పదవికి ముప్పేమీ లేదనే భరోసాతో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

27 తర్వాత సమావేశం

ఈనెల 27వ తేదీతో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవీకాలం మూడేళ్లు పూర్తవుతుంది. అవిశ్వాసానికి ఇది అనుకూలమని భావిస్తున్న సొంత పార్టీ(బీఆర్‌ఎస్) కౌన్సిలర్లు శ్రావణిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టించేలా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీ తర్వాత జిల్లా మంత్రి, పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సమావేశమవుతారని తెలిసింది. అయితే, కౌన్సిలర్ల మనోభావాలు దెబ్బతీయవద్దనే ఉద్దేశంతో అవిశ్వాస తీర్మానం వైపే మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కౌన్సిలర్లు పట్టుదలతో చేసేదేమీలేక ఎమ్మెల్యే మిన్నకుండిపోయినట్లు సమాచారం.

రాజీనామా యోచనలో కౌన్సిలర్లు..

అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు అధిష్టానం సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో మెజార్టీ కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయాలనే యోచనలో ఉన్నారని తెలిసింది. ఇదే విషయాన్ని కొందరు బహిరంగంగా కూడా ప్రకటిస్తున్నారు.

మౌనం వహిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మున్సిపల్ పాలకవర్గంలో చోటుచేసుకుంటున్న అసమ్మతిపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇంకా మౌనంగానే ఉన్నారు. కౌన్సిలర్ల మనోభావాలు దెబ్బతీయవద్దనే ఉద్దేశంతోనే ఆయన నిమ్మకుండిపోయారని అంటున్నారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రైతు వేదికలకు రక్షణ కరువు

- మందు బాబులకు అడ్డాలుగా మారిన వైనం

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలోని రైతు వేదికలకు రక్షణ కరువైంది. గ్రామ శివారుల్లో.. నిర్మానుష్య ప్రదేశాల్లో నిర్మించడంతో రాత్రిపూట మందు బాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ఆకతాయిల చేష్టలకు రూ.లక్షల విలువైన ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమవుతున్నాయి. విలువైన వస్తువు, సామగ్రి దొంగల పాలవుతోంది.

తలుపులు ధ్వంసం చేసి..

- గతేడాది పెగడపల్లి మండలంలోని నందగిరి రైతు వేదిక భవనం తలుపులు ధ్వంసం చేసిన దొంగలు.. కుర్చీలు ఎత్తుకెళ్లారు.
- జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో తలుపులు పగుల గొట్టారు.
- ఇలాంటి సంఘటనలు జరిగితే స్థానిక వ్యవసాయ అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు కానీ.. వాటి రక్షణకు ముందస్తు చర్యలు తీసుకోవడంలేదు.
- దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలకు భద్రత లేకుండా పోయింది.

20 మండలాలు.. 71 రైతు వేదికలు..

జిల్లాలోని 20 మండలాల్లో 71 క్లస్టర్లు ఉన్నాయి. ఇందులో 71 రైతువేదికలు నిర్మించారు. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ విస్తరణాధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఒక్కోదాంట్లో 125 ప్లాస్టిక్ కుర్చీలు, 10 ఎస్ టైపు కుర్చీలు, 2 ఎగ్జిక్యూటివ్ కుర్చీలు, 2 టేబుళ్లు, 1 బీరువా, 1 మైక్‌సెట్ లాంటి సామగ్రి సమకూర్చారు. కంప్యూటర్లతోపాటు మైక్ సెట్లు సమకూర్చిన ప్రభుత్వం.. వాటి పటిష్ట రక్షణకు ఎలాంటి



నందగిరి పొలిమేర గుట్టపై నిర్మించిన రైతువేదిక

చర్యలూ తీసుకోలేదు. మరోవైపు.. గ్రామాలు, మండల కేంద్రాల్లో నడిబొడ్డున నిర్మించాల్సిన రైతు వేదికలను ఊరు చివరన.. నిర్మానుష్య ప్రాంతాల్లో నిర్మించారు. రక్షణ కోసం ప్రహరీలు, కంచెలు నిర్మించలేదు. సిబ్బంది విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాక రాత్రి వేళల్లో మందుబాబులు అడ్డా వేస్తున్నారు. మరుసటిరోజు చూసేసరికి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. తాగిపడేసిన మద్యం సీసాలు, పగిలిన గాజు పెంకులు దర్శనమిస్తున్నాయి. తాగిన మైకంలో కొందరు రైతు వేదికల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యం..

సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పోలీసు పెట్రోలింగ్ పెంచితే గ్రామ శివారుల్లోని రైతు వేదికలకు కొంత భద్రత కల్పించినట్లవుతుందని భావిస్తున్నారు. ఈమేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

రైతువేదికల్లో చోరీలు జరుగుతున్నాయని, ఆకతాయిలు ఆస్తులు ధ్వంసం చేస్తున్నారనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వీటిని నియంత్రించడానికి త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అలాకాని పక్షంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచేందుకు విన్నవిస్తాం. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అపహరించడాన్ని ఉపేక్షించేది లేదు. ఇలాంటి ఘటనలపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

మార్కెట్ కోసం వినతి



వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ప్రజలు

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని సమీకృత మార్కెట్‌ను వ్యవసాయ మార్కెట్‌లోనే త్వరిత గతిన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ పలువురు ప్రజలు, యువకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేశ్, జలేందర్, రవీందర్, వెంకటేశ్, పోచయ్య, అశోక్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ పథకాల వడ్డీ రేట్లు పెంపు

జగిత్యాల: తపాలా శాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు భారీగా వడ్డీ రేట్లు పెరిగాయని పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 28 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓదెల పీఆర్ ఏఈ సస్పెన్షన్

పెద్దపల్లిరూరల్: ఓదెల మండల పీఆర్ ఏఈ సమ్మిరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సంగీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మన ఊరు.. మనబడి పనుల్లో కలెక్టర్ సహా.. ఉన్నతాధికారులు పలుమా ర్లు సూచనలు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపు, ఎంబీ రికార్డు నమోదు సకాలంలో పూర్తి చేయని కారణంగా సమ్మిరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి



గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రూ.25వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో జీతాలు చెల్లించలేని స్థితికి సింగరేణి చేరుకుందన్నారు. సంస్థలో శరవేగంగా సాగుతున్న కాంట్రాక్టీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 11వ వేతన ఒప్పందం ఖరారులో బీఎంఎస్ కీలకపాత్ర పోషించిందన్నారు. నాయకులు సారంగపాణి, మాదాసి రవీందర్, స్వామి, సాంబయ్య, రాజేశం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన వరికొప్పుల సంపత్‌కు విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ సీఐ కె.స్వామి తెలిపారు. విద్యుత్ సంస్థ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడ్డ సంపత్‌పై కేసు నమోదు చేయడంతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించి మొదటి నేరంగా వదిలిపెట్టడం జరిగిందన్నారు. అయినా పద్ధతి మార్చుకోని సంపత్ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ రెండవ సారి దొరకడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. కోర్టు చేపట్టే విచారణకు విధిగా హాజరుకావాలని ఆదేశిస్తూ అతడికి బెయిల్ మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి సంపత్ తప్పించుకు తిరుగుతుండగా మంగళవారం ఎస్సై నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రమేష్, రాజయ్య శ్రీనివాసనగర్‌లో అతన్ని పట్టుకొని కోర్టులో హాజరపర్చినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన జిల్లా అదనపు ప్రధాన న్యాయమూర్తి, నిందితున్ని జైలుకు తరలిస్తూ ఆదేశాలిచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

సగానికి పడిపోయిన దిగుబడి

- 65 లక్షల క్వింటాళ్లు అంచనా వేస్తే 36 లక్షల క్వింటాళ్లే రాక
- వానాకాలం సీజన్‌లో జిల్లా రైతులకు రూ.590.69 కోట్ల నష్టం



యాసంగిలో నాటు వేస్తున్న మహిళలు (ఫైల్)

జగిత్యాల అగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో రైతులు అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు చేసినా ధాన్యం దిగుబడి సగానికి పడిపోయింది. రైతులు నాణ్యమైన విత్తనాలతోపాటు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో అన్నదాతలు ఈ యాసంగిలో వరి సాగుపై ఆశలు పెట్టుకున్నారు.

దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు

జగిత్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరానికి కనీసం 23 నుంచి 25 క్వింటాళ్ల చొప్పున 65 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే, వరి పంట పూత దశలో అధిక వర్షాలు కురవడంతో పురుగుల, తెగుళ్ల బెడద ఎక్కువైంది. దీంతో దిగుబడి ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లకే పరిమితమైంది. పిలక దశలోనే కాండం తొలుచు పురుగు, గింజ దశలో తెల్లకంకి రావడంతో దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.

36 లక్షల క్వింటాళ్లు కొనుగోలు

వానాకాలం సీజన్‌కు సంబంధించి, రైతన్నలకు దాదాపు రూ.590.69 కోట్ల నష్టం వచ్చింది. అధికారుల అంచనా ప్రకారం 65 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకుంటే కేవలం 36 లక్షల క్వింటాళ్లు వచ్చింది. మహిళా సంఘాలు, సింగిల్‌విండోలు 420 కేంద్రాల ద్వారా ఈ ధాన్యం కొనుగోలు చేశారు.

పెట్టిన పెట్టుబడి రాలే..

వరి పంటకు ఎకరాకు దాదాపు రూ.20 వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దిగుబడి కనీసం 20 క్వింటాళ్లు వస్తేనే వారికి లాభం. ప్రస్తుతం 10 నుంచి 15 క్వింటాళ్లు మాత్రమే రావడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు.

యాసంగి సీజన్‌పైనే ఆశలు

యాసంగి సీజన్‌లోనూ జిల్లా రైతులు 3 లక్షలకు పైగా ఎకరాల్లో వరి వేశారు. ఈసారైనా అధిక దిగుబడులు తీయాలన్న ఆశతో నాణ్యమైన విత్తనాలను వ్యవసాయ పరిశోధన స్థానాలు, నమ్మకమైన సంస్థల నుంచి కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో అనువైన పొడి వాతావరణం ఉండటంతోపాటు పంట గింజకు వచ్చే వరకు ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉండటంతో ఎకరాకు కనీసం 30 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ పురుగుల ఉధృతి ఉండటంతో ఇప్పటినుంచే రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. వానాకాలంలో పంట దిగుబడి రాక బ్యాంకుల్లో అప్పులు కట్టలేని దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెల్ల కంకి ఆశించింది..



వానాకాలంలో వరి పంటను తెల్ల కంకి ఆశించడంతో దిగుబడి చాలా తగ్గింది. చాలాసార్లు మందులు కొట్టినప్పటికీ ఉపయోగం లేకపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ఈ యాసంగిపైనే ఆశలు పెట్టుకున్న. – సత్యనారాయణ రెడ్డి, రైతు, సారంగాపూర్

వరికి యాసంగి అనుకూలం..



వానాకాలంతో పోల్చితే వరి పంటకు యాసంగి అనుకూలంగా ఉంటుంది. పొడి వాతావరణ పరిస్థితులకు తోడు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దిగుబడులు పెరిగేందుకు దోహదం చేస్తాయి. వానాకాలంలో తెగుళ్లు సోకి, నష్టం జరిగింది. – డాక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

జీపీ భవనాలకు రూ.6 కోట్లు మంజూరు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కోరుట్ల నియోజకవర్గంలో కొత్త పంచాయతీలుగా ఏర్పడిన గ్రామాల్లో, జీపీ భవనాలు శిథిలావస్థలో ఉన్న పల్లెల్లో నూతన భవనాల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజురు చేసినట్లు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలోని కొమటికొండాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి, రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్తులు అడగకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.13.90 కోట్లు మంజురు చేసినట్లు తెలిపారు. ప్రతీ గ్రామానికి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు కమటం భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ మహేశ్వర్, సర్పంచు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు జైలేశ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, ఉపసర్పంచు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లాల దశరథ్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నిరంజన్‌రెడ్డి, నాయకులు జాజాల జగన్‌రావు, నేమూరి సత్యనారాయణ, సుగుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ నిరసన

- అధికారులను అడిగితే ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారు..
- మంగేళ గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఆవేదన



కార్యాలయంలో పడుకొని నిరసన తెలుపుతున్న శంకర్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామ మాజీ సర్పంచ్ భర్త బనుక శంకర్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిరసన తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం.. మంగేళ గ్రామ సర్పంచ్‌గా శంకర్ భార్య పద్మ 2013–14 నుంచి ఐదేళ్లు బాధ్యతలు నిర్వహించారు. పదవీకాలం ముగింపు సమయంలో, ఆ తర్వాత వచ్చిన ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామంలో బోర్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులు రూ.55,100 రావాల్సి ఉంది. దీనికి సంబంధించిన చెక్కును అప్పటి ప్రత్యేకాధికారి, సంబంధిత పంచాయతీ కార్యదర్శి 2019 జనవరి 28న అందించారు. దీంతోపాటు పద్మ పదవీకాలంలో కొన్ని నెలల వేతనం రావాలి. ఈ డబ్బులు గ్రామ పంచాయతీ నుంచి చెల్లించాల్సి ఉంది. అడిగితే మండల పరిషత్ కార్యాలయంలోని ఓ అధికారి, మంగేళ పంచాయతీలోనూ తనతో ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారని శంకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు డబ్బులు ఇప్పించాలంటూ మండల పరిషత్ కార్యాలయ ద్వారానికి అడ్డుగా పడుకొని, నిరసన తెలిపాడు. ఈ విషయమై కలెక్టర్ రవి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌లను కలవనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోర్టుకు హాజరైన ప్రతిపక్ష కౌన్సిలర్లు



కోర్టు ప్రాంగణంలో కౌన్సిలర్లు

జగిత్యాలజోన్: జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు కల్లెపల్లి దుర్గయ్య, నక్క జీవన్ కుమార్, ములాస్తం లలిత, ఇండిపెండెంట్ కౌన్సిలర్ అనుమండ్ల జయశ్రీలు మంగళవారం జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. 19 జూన్ 2020న జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎజెండాను చదవకుండానే పాస్ చేయడంతో ప్రతిపక్ష కౌన్సిలర్లు మున్సిపల్ గేటు ఎదుట నిరసన తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సమన్లు జారీ అవడంతో కోర్టుకు వచ్చారు. వీరికి మద్దతుగా గాజుల రాజేందర్, బండ శంకర్, అనుమండ్ల రఘులు హాజరయ్యారు. అధికార పార్టీ సభ్యులు తమపై లేనిపోని ఆరోపణలు చేసి, కేసు నమోదు చేయించారని ఆరోపించారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్

- జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు సంచాలకుడు సుధీర్



మాట్లాడుతున్న సంచాలకుడు సుధీర్

జగిత్యాలరూరల్: మహిళా సంఘాల ఉత్పత్తులకు సహజ బ్రాండ్‌తోపాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, జగిత్యాల జిల్లా కేంద్రంలో రూరల్ మార్ట్ ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు సంచాలకుడు సుధీర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూర్ మండల సెర్ప్ కార్యాలయంలో అర్బన్, రూరల్ మండలాల సమాఖ్యల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు యూనిట్ల నిర్వహణతో గుర్తింపు తెచ్చుకోవడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా అర్బన్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన రాధ తయారు చేసిన, అగర్‌బత్తులను ప్రదర్శించి, అమ్మకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంజీఎస్‌ఎఫ్ సభ్యురాలు నవ్య, వెల్గటూర్, జగిత్యాల ఏపీఎంలు చంద్రకళ, గంగాధర్, రవీందర్, సంతోష్, స్త్రీనిధి మేనేజర్లు మారుతి, రాణి, సమాఖ్య అధ్యక్షురాలు భవాని, సభ్యులు పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో కథలాపూర్‌వాసి మృతి

- 14 ఏళ్ల క్రితం వెళ్లి.. ఇంటికి వద్దామనుకుంటుండగా గుండెపోటు



నర్సయ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నర్సయ్య(55) సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నర్సయ్య ఉపాధి నిమిత్తం 14 ఏళ్ల క్రితం సౌదీ వెళ్లాడు. అక్కడ సరిగా పని లేకపోవడంతోపాటు తప్పిపోయాడు. రకరకాల పనులు చేస్తుండేవాడు. స్వగ్రామం వెళ్లి, కుటుంబసభ్యులను చూడాలని ఇటీవల అక్కడే పలువురిని సంప్రదించాడు. ఈ నెల 24న ఇంటికి వచ్చేందుకు టికెట్ బుక్ చేయించుకున్నాడు. ఇంతలో సోమవారం గుండెపోటు రావడంతో అక్కడి మిత్రులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వా త మృతిచెందాడు. మృతుడికి భార్య బుజ్జి, కుమారుడు జానీ ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామం రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మృతుడి కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

లింగ నిర్ధారణ నేరం

- మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి శశికాంత్‌రెడ్డి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: లింగ నిర్ధారణ చేయడం నేరమని, ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి శశికాంత్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన సామాజికవేత్త తొటు రాంచంద్రం రూపొందించిప భ్రూణ హత్యలు.. నివారణ అవగాహన కరపత్రాన్ని ఆస్పత్రిలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ, ఆస్పత్రుల్లో బోర్డులు కనిపిస్తున్నా కొందరు చాటుమాటున లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తున్న ఇలాంటి వారు శిక్షార్హులన్నారు.

ఆడపిల్లల అభివృద్ధికి కృషి

ఆడపిల్లల అభివృద్ధికి ప్రతిఒక్కరూ దోహదపడాలని బాలల సంరక్షణ అధికారి హరీశ్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆడపిల్లలు మగవారితో సమానమన్నారు. వారికి అన్ని హక్కులు కల్పించాలని కోరారు. బాలికలకు ఏవైనా సమస్యలు ఎదురైతే 1098 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

గ్రామాల్లో ఖాళీలకు ఎన్నికలెప్పుడు?

- జిల్లాలో 4 సర్పంచు, 4 ఎంపీటీసీ, 70 వార్డు స్థానాలు ఖాళీ
- మూడేళ్లు దాటినా భర్తీ చేయని సర్కారు
- అసెంబ్లీకి ముందస్తు ఎన్నికల ప్రచారం నేపథ్యంలో సందిగ్ధం



మల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

జగిత్యాలరూరల్: 2019లో గ్రామ పంచాయతీ సర్పంచు, ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా పల్లెల్లో పాలన కుంటుపడింది. జగిత్యాల జిల్లాలో 4 సర్పంచు స్థానాలతోపాటు 4 ఎంపీటీసీ, 70 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు తప్పడం లేదు.

రాజీనామా, ప్రజాప్రతినిధులు చనిపోవడమే కారణం

జిల్లాలో ఆయా ఖాళీ స్థానాలకు రాజీనామాలు, ప్రజాప్రతినిధులు చనిపోవడం వంటి కారణాలున్నాయి. కొడిమ్యాల మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం నెగ్గడంతో మరొకరిని ఎన్నుకున్నారు. చాలాచోట్ల అవిశ్వాస తీర్మానాలతో ఉపసర్పంచ్ పదవులు ఖాళీ అయ్యాయి.

జిల్లాలో 380 గ్రామాలు..

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉండగా 70 వార్డుల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. మల్లాపూర్ పంచాయతీ ఏకగ్రీవం కాగా కోర్టు కేసు నేపథ్యంలో ఖాళీగా ఉంది. ఇబ్రహీంపట్నం మండలంలోని మూలరాంపూర్, ధర్మపురి మండలంలోని జైన సర్పంచులు మరణించడంతో ఖాళీ అయ్యాయి. ధర్మపురి మండలంలోని రాజారం సర్పంచ్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. కొడిమ్యాల మండలంలోని పూడూరు, కోరుట్ల మండలంలోని జోగినిపల్లి, జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్, జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు మృతి చెందారు.

మరో ఏడాదే గడువు..

పంచాయతీ పాలకవర్గాలకు మరో ఏడాది మాత్రమే గడువు ఉంది. ఖాళీలు ఏర్పడి, మూడేళ్లు దాటిపోయింది. అయినా వివిధ కారణాలతో ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు వస్తాయన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరుపుతారా లేదా అన్న సందిగ్ధం నెలకొంది.

నోటిఫికేషన్ వస్తే నిర్వహిస్తాం



జిల్లాలో నాలుగు సర్పంచు, నాలుగు ఎంపీటీసీ, 70 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఎన్నికల సంఘం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నోటిఫికేషన్ వస్తే ఎన్నికలు నిర్వహిస్తాం. – నరేశ్, ఇన్‌చార్జి డీపీవో

మహిళల స్వయం ఉపాధికి చేయూత

- ఆర్థికంగా అభివృద్ధి లక్ష్యం
- మంత్రి కొప్పుల ఈశ్వర్



యూనిట్ల ప్రొసీడింగ్స్ అందిస్తున్న మంత్రి ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జెడ్పీటీసీ బొడ్డు సుధారాణి ఆధ్వర్యంలో ఎన్నికై న బీఆర్‌ఎస్ మహిళా విభాగం గ్రామ కార్యవర్గం, వెల్గటూర్, కప్పారావుపేట, పాశిగామ, రాజక్కపల్లికి చెందిన మహిళలు కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్త కార్యవర్గాలకు మంత్రి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. స్వయం ఉపాధి పరిశ్రమ ఏర్పాటుకోసం మహిళలు మంత్రికి విన్నవించగా.. వెంటనే స్పందించిన మంత్రి రెండు పేపర్ ప్లేట్ తయారీ యూనిట్లను మంజూరు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. జెడ్పీటీసీ సుధారాణి, నాయకులు మల్లిక, గంగవ్వ, ఎండీ రజియా, మహిళలు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ శంకర్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న శంకర్



తెలుగు భాష, సంస్కృతిపై గీసిన కార్టూన్

కోరుట్ల: ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాష, సంస్కృతిపై కార్టూన్ల పోటీలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 200 కార్టూన్లు ప్రదర్శించగా ఉత్తమ కార్టూన్ కేటగిరీలో కోరుట్ల పట్టణానికి చెందిన ద్యావనపెల్లి శంకర్ కార్టూన్ ఎంపికై ంది. ఆయనకు సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి దుర్గాప్రసాద్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందించారు. శంకర్‌ను కోరుట్ల పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ధ్రువపత్రాల జారీలో అధికారుల కాలయాపన



నిరసన తెలుపుతున్న నాయకులు

సారంగాపూర్(జగిత్యాల): కుల, ఆదాయ ఇతర ధ్రువపత్రాల జారీలో అధికారులు కాలయాపన చేస్తున్నారని వైఎస్సార్‌టీపీ, వీబీఏ పార్టీల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి కాముని గంగాధర్, వీబీఏ (వంచిత్ బహుజన్ అఘాడి) ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి గవ్వల శ్రీకాంత్‌లు మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థులు, యువకులు కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువపత్రాలు కావాలని దరఖాస్తు చేసుకుంటే అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కలెక్టర్ విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాల ఇన్‌చార్జీలు జాడి ప్రేమ్‌సాగర్ నేత, తడకొండ సత్యరాజ్, నాయకులు మధు, హరీశ్, చెక్కపల్లి పద్మ, మమత, రాజేశం, గాయత్రి, సుజాత, కలెప్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పనుల నిలిపివేతకు ఉద్యమించాలి

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులను ఇబ్బందులు పెట్టేలా నిర్మించే సమీకృత మార్కెట్ పనుల నిలిపివేత కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా సమీకృత మార్కెట్ నిర్మించాలని, అవసరమైతే భూమి కొనుగోలు చేయాలన్నారు. అంతే తప్ప రూ.3కోట్లతో పట్టణ శివారులో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మార్కెట్‌యార్డులో సమీకృత మార్కెట్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. నాయకులు రవీందర్‌రావు, గోపి రాజిరెడ్డి, మ్యాకల రమేశ్, పడిగెల రవీందర్‌రెడ్డి, బాపురపు నర్సయ్య, లక్ష్మీనారాయణ, ఎద్దండి దివాకర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.